సాక్షి
ఒడిశా
శనివారం । 13 । జులై । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ.1,80,721

- భువనేశ్వర్/పూరీ



రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

రాయగడ జిల్లాలోని రామనగుడ సమితి కొండజామ వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు తీవ్రగాయాలకు గురయ్యారు. - 8లో



వామనావతారంలో జగన్నాథుడు

గుండిచా మందిరంలో కొలువై ఉన్న భక్తులకు వివిధ రూపాల్లో దర్శనమిస్తున్న జగన్నాథుడు శుక్రవారం వామన, బలరాముడు, పరశురాముడు అవతారాల్లో దర్శనమిచ్చారు. - 8లో

న్యూస్‌రీల్

భవన నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ నిర్వహిస్తున్న దృశ్యం

జయపురం: స్థానిక జగన్నాథ్ సాగర్ సమీపంలోని నేతాజీ పార్క్ వద్ద మున్సిపాలిటీ కేటాయించిన స్థలంలో జయపురం సాహిత్య పరిషత్ భవన నిర్మాణానికి పరిషత్ అధ్యక్షుడు హరిహర కరసుధా పట్నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం భూమిపూజ జరిగింది. కార్యక్రమంలో పరిషత్ కార్యదర్శి నిరంజన్ పాణిగ్రహి, కోశాధికారి ప్రమోద్ కుమార్ రౌళో, సహాయ కార్యదర్శి డా.సుదాంశు శేఖర పట్నాయిక్, ఉపాధ్యక్షుడు మధసూదన మిశ్ర, కో–ఆర్డినేటర్ నవకృష్ణ రథ్, సభ్యులు లక్ష్మీ పాణిగ్రహి, ప్రఫుల్ల కుమార్ దాస్, కవితా మంజరి పలాయ్, తపస్ కిరణ్ త్రిపాఠీ, ఘాశీ రాం మహాపాత్ర, యుగల్ కిశోర్ మిశ్ర తదితరులు పాల్గొన్నారు.

సారా బట్టీలపై ఎక్సైజ్ దాడులు



సీజ్ చేసిన సామగ్రితో ఎక్సైజ్ సిబ్బంది

జయపురం: స్థానిక నీలాగుడ గ్రామ సమీప అడవిలో నాటుసారా బట్టీలపై జయపురం ఎక్సైజ్ సిబ్బంది శుక్రవారం దాడులు నిర్వహించారు. అడవిలో నాటుసారా కాస్తున్నట్లు అందిన సమాచారంతో జయపురం ఎక్సైజ్ విభాగ అధికారి నీలాద్రి బిహారి మిశ్ర నేతృత్వంలో దాడులు జరిపారు. దీనిలో భాగంగా 1,500 లీటర్ల ఇప్ప ఊట, 200 లీటర్ల సారాను పట్టుకున్నట్లు వెల్లడించారు. సారాను ధ్వంసం చేసి, తయారీ సామగ్రిని సీజ్ చేశామని తెలిపారు. అయితే సారా తయారీదారులు ముందుగానే పారిపోయారన్నారు. ఎవరైనా అక్రమంగా సారా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

'ఉపాధ్యాయుల పాత్ర గురుతరమైనది'



నియామక పత్రాలు అందజేస్తున్న దృశ్యం

జయపురం: విద్యార్థులను తీర్చి దిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర గురుతరమైనదని బొరిగుమ్మ సమితి విద్యాధికారి సచిన్ మల్లిక్ అన్నారు. సమితి పరిధిలోని పలు పాఠశాలలకు 23 మంది ఉపాధ్యాయులు నియమించబడ్డారు. దీంతో వారికి ఆయన కార్యాలయంలో నియామక పత్రాలు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా బ్లాక్ విద్యాధికారి సంజుక్త పండ, సీనియర్ ఉపాధ్యాయుడు శశిభూషణ దాస్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవం, బాధ్యతతో కూడుకున్నదని పేర్కొన్నారు. విద్యార్థులకు గుణాత్మక విద్యనందించి ఉత్తమ పౌరులను సమాజానికి అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

జయపురం ఆస్పత్రి సందర్శన



ఆస్పత్రి సిబ్బందితో చర్చిస్తున్న కేంద్ర బృందం

జయపురం: స్థానిక జిల్లా కేంద్ర ఆస్పత్రిని కేంద్ర శిశు ఆరోగ్య విభాగ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ సోవణి గుప్త నేతృత్వంలో ఒక బృందం శుక్రవారం సందర్శించింది. ఆస్పత్రిలో నవజాతి శిశువులు, బాలింతలు, గర్భిణులకు అందిస్తున్న సేవలపై సమీక్షించారు. కుటుంబ సంక్షేమ ఏడీపీహెచ్‌వో డాక్టర్ నీల మాధవ శతపతి తదితర వైద్యులతో సమావేశమై శిశు సంరక్షణ, ఆరోగ్యంపై చర్చించారు. శిశు విభాగ ఓపీడీ, ఎస్ఎన్‌సీయూ, ఓటీ, ప్రసూతి విభాగం, డీఈఐసీపై సిబ్బందితో వాకబు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ దిలీప్ కుమార్ బిశ్వాల్, శిశు చికిత్స విభాగ స్పెషలిస్టు డాక్టర్ దుర్గా ప్రసాద్ పాత్రో, డాక్టర్ గౌతమ కుమార్ త్రిపాఠీ, డీపీఎం శుభకాంత గంతాయత్, ఆస్పత్రి మేనేజర్ రూపసి మధుశ్మిత నాయిక్ తదితరులు పాల్గొన్నారు.



శుద్ధజలంతో రథం శుభ్రం చేస్తున్న దృశ్యం



అడపా మండపం నుంచి తరలివస్తున్న ఆజ్ఞామాల



భద్రతా వలయం మధ్య మలుపు తిరుగుతున్న దేవీ సుభద్ర దర్ప దళనం

బహుడా సన్నాహాలు షురూ..!



రథాలకు ఆజ్ఞామాలతో పూజ

భువనేశ్వర్: శ్రీజగన్నాథుని మారు రథయాత్ర బహుడా సన్నాహాలు ప్రారంభమయ్యాయి. మూల విరాటులు గుండిచా నుంచి శ్రీమందిరానికి తరలి వెళ్లేందుకు రథాలు సిద్ధం చేయడం ఆరంభమైంది. శ్రీమందిరానికి అభిముఖంగా 3 రథాలను మలుపు తిప్పారు. శుక్రవారం ప్రాతః ధూపదీపన అనంతరం మూడు రథాలను శ్రీమందిరానికి అభిముఖంగా దక్షిణం వైపు తిప్పారు.

మూల విరాటుల ఆజ్ఞతో...

అడపా మండపంపై కొలువుదీరిన మూల విరాటుల నుంచి ఆజ్ఞామాల వచ్చిన తర్వాత ఈ కార్యక్రమం చేపట్టారు. మారు రథయాత్ర తొలి ఘట్టం

● దక్షిణ మలుపు తిరిగిన మూడు రథాలు

ఇది. గుండిచా మందిరం సింహద్వారం పరిసరాల్లో ఉన్న 3 రథాలను నక్కొచొణా ద్వారం వద్దకు తీసుకుని వచ్చారు. ఆజ్ఞామాల చేరడంతో రథాలను శుద్ధజలంతో శుచిగా కడిగి శుభ్రం చేశారు. అనంతరం ఆజ్ఞామాలతో పూజాదులు నిర్వహించారు. పూజాదులు పూర్తి కావడంతో రథాలు మలుపు తిప్పడం ప్రారంభించారు. తొలుత దేవీ సుభద్రా దర్ప దళనం దక్షిణ మలుపు తిప్పారు. తర్వాత బలభద్ర స్వామి తాళ ధ్వజం, చివరగా శ్రీ జగన్నాథుని నందిఘోష్ రథాలు దక్షిణం వైపునకు తిప్పారు. మూల విరాటుల ఆగమనం కోసం ఈ 3 రథాలు నిరీక్షణ ఆరంభం అయింది.

త్రుటిలో తప్పిన ప్రమాదం



ఒకవైపునకు ఒరిగిపోయిన బస్సు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ నుంచి రాయగడకు వస్తున్న కాలభైరవ అనే ప్రైవేట్ బస్సు ముకుందపూర్ ఘాట్ మలుపులో అదుపుతప్పింది. ఎదురుగా వస్తున్న ఒక బొలేరోను తప్పించబోయి అదుపుతప్పి పక్కనే గోతులో దిగబడి ఒకవైపునకు ఒరిగిపోయి అలా ఉండిపోయింది. దీంతో త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. శుక్రవారం ఉదయం 11.20 గంటలకు చోటుచేసుకున్న ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్నవారు సురక్షితంగా బయటపడ్డారు. డ్రైవర్ అత్యంత చాకచక్యంగా వ్యవహరించడంతో లోయలో బస్సు పడలేదు. బస్సు ఒకవైపునకు ఒరగడంతో ప్రయాణికులంతా కిటికీల నుంచి కిందకి దిగారు. అనంతరం వేరే బస్సులో గమ్య స్థానాలకు చేరుకున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మాంసాహార దుకాణాలపై చర్యలు

● ఐఐసీ ప్రశాంత్ భూపతి



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న వీహెచ్‌పీ, భజరంగ్ దళ్ సభ్యులు

పర్లాకిమిడి: రథయాత్ర జరుగుతున్న జగన్నాథ మందిరం నుంచి గుండిచా మందిరం ప్రాంతం వరకు మాంసాహారం అమ్మకూడదని ఉత్తర్వులు ఉన్నా కొంతమంది పట్టించుకోకుండా వ్యాపారాలు సాగిస్తున్నారు. దీంతో విశ్వహిందూ పరిషత్ సభ్యులు స్థానిక ఆదర్శ పోలీసుస్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఐఐసీ ప్రశాంత్ భూపతి మాట్లాడుతూ.. మాంసాహార దుకాణాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయా ప్రాంతాల్లో విక్రయాలు చేపట్టవద్దని స్పష్టం చేశారు. కాగా రాజవీధిలో కొందరు ఫాస్ట్ ఫుడ్ వ్యాపారులు తిరస్కరించడంతో ఆయా దుకాణాలకు తాఖీదులు ఇచ్చారు. ఫిర్యాదు చేసిన వారిలో వీహెచ్‌పీ కార్యదర్శి మనోజ్ దాస్, పట్టణ అధ్యక్షుడు కైలాస్ పట్నాయిక్, బీజేపీ సాధారణ కార్యదర్శి జగన్నాథ మహాపాత్రో, డాక్టర్ శరత్ కుమార్, భజరంగ్ దళ్ అధ్యక్షుడు రాబిన్ సాహుకార్ తదితరులు ఉన్నారు.

రాజధానిలో పెరుగుతున్న సైబర్ నేరాలు

భువనేశ్వర్: రాజధాని నగరంలో సైబర్ నేరాలు పెరుగుతున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు గడిచిన 6 నెలల్లో నగరంలో 2,394 సైబర్ నేరాలు చోటు చేసుకున్నాయి. వీటిలో పోలీసులు 110 కేసులు నమోదు చేశారని భువనేశ్వర్ – కటక్ జంట నగరాల పోలీస్ కమిషనర్ సంజీబ్ పండా శుక్రవారం తెలిపారు. ఈ వ్యవధిలో సైబర్ నేరగాళ్లు రూ.36 కోట్లు కొల్లగొట్టారని ఆందోళన వ్యక్తం చేశారు. విచారణ సందర్భంగా వివిధ బ్యాంకు ఖాతాల్లో రూ.9.50 కోట్లు స్తంభింపజేసినట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్ మోసానికి గురైన బాధితులు సమగ్రంగా రూ.46 లక్షలు తిరిగి పొందారన్నారు. చాలా సైబర్ మోసం కేసులు యూపీఐ, సోషల్ మీడియా, పార్శిల్, సిమ్, కేవైసీ మోసానికి సంబంధించినవిగా పేర్కొన్నారు. సైబర్ నేరాలపై విచారణ జరిపిన కమిషనరేట్ పోలీసులు ఇప్పటివరకు 21 మంది సైబర్ నేరగాళ్లను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. 21 మంది నేరస్తుల్లో 5 మంది అంతర్ రాష్ట్ర నేరస్తులున్నట్లు స్పష్టం చేశారు.

రథంపై సెల్‌ఫోన్ నిషేధం

● సీఏవో అరవింద కుమార్ పాఢి వెల్లడి



శ్రీజగన్నాథుని రథం నందిఘోష్‌కు నమస్కరిస్తున్న సీఏవో అరవింద కుమార్

భువనేశ్వర్: రథాలపై నిర్ణీత సంఖ్య కంటే ఎక్కువ మంది సేవాయత్‌లు ఉండడం, సెల్‌ఫోన్లు తీసుకెళ్లడాన్ని పూర్తిగా నిషేధిస్తున్నట్లు శ్రీమందిరం నూతన సీఏవో డాక్టర్ అరవింద కుమార్ పాఢి స్పష్టం చేశారు. శ్రీమందిరం ప్రధాన పాలన అధికారి (సీఏఓ)గా ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించి, రథానికి శిరసావహించి నమస్కరించారు. సేవాయత్ వర్గంలో క్రమశిక్షణ క్రమబద్ధీకరించి అవకతవకలు సవరించడమే ప్రధాన కర్తవ్యంగా పేర్కొన్నారు. ఈ ఉత్తర్వుల ఉల్లంఘన తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దేవుళ్ల సేవకు నియమితులైన సేవాయతులను మాత్రమే రథంపైకి అనుమతిస్తారన్నారు. ఈ మేరకు అనుబంధ వర్గాల సహకారాన్ని అభ్యర్థించారు. వీరి సహకారంతో శ్రీజగన్నాథుని సంస్కృతి విశేష ఆదరణకు నోచుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అడపా పాహండీ సందర్భంగా జరిగిన దుర్ఘటనపై భగవంతునికి క్షమాపణలు కోరినట్లు తెలిపారు. ఈ విచారకర ఘటనపై ప్రత్యేక కమిటీని నియమించారు. విచారణ కమిటీ నివేదిక ఆధారంగా చర్యలు చేపడతామన్నారు. ఇకపై ఇలాంటి ఘటనలు జరగకుండా శ్రీమందిరం యాజమాన్యం జాగ్రత్తలు తీసుకుంటుందని తెలిపారు. స్వామి దైనందిన సేవాదులు ఇతర విధానాలు సజావుగా సాగుతాయన్నారు. ఈ నేపథ్యంలో సేవాయతుల్లో క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వబడుతుందని స్పష్టం చేశారు.

అడపా పాహండి దుర్ఘటనపై ఫిర్యాదు

భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథుని రథయాత్రలో అడపా పాహండి సందర్భంగా చోటు చేసుకున్న దుర్ఘటనపై పోలీసుస్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు నమోదైంది. ఈ ఘటనలో బలభద్ర భగవానుడి భారీ మూల విరాటు చారుమళ్లపై బోర్లా పడింది. దీంతో పలువురు సేవాయత్‌లు ఈ దారు విగ్రహం కింద చిక్కుకున్నారు. గాయపడిన వారికి సత్వర చికిత్స అందజేయడంతో వీరంతా కోలుకోగలిగారు. ఈ విచారకర ఘటనకు శ్రీ మందిరం ప్రధాన పాలన అధికారి(సీఏఓ)ని బాధ్యులు, పూచీదారులుగా పేర్కొని స్థానిక క్యాపిటల్ పోలీసు ఠాణాలో ఫిర్యాదు నమోదైంది. శ్రీమందిరం ప్రధాన పాలన అధికారి వీర్ విక్రమ్ యాదవ్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని ఆరోపిస్తూ 5 మంది న్యాయవాదులు ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఉరి వేసుకొని జవాన్ ఆత్మహత్య

భువనేశ్వర్: స్థానిక 7వ బెటాలియన్ క్యాంపస్‌లో శుక్రవారం ఉదయం ఒక జవాన్ మృతదేహం చెట్టుకు వేలాడుతూ కనిపించింది. పరిసరాలు ఆధారంగా అతను ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. మృతుడు దుర్యోధన్ మహంతిగా గుర్తించారు. అతను 2002 బ్యాచ్ సిపాయి. కుటుంబ కలహాలు, అప్పుల కారణంగానే అతడు ఈ దారుణానికి ఒడిగట్టినట్లు అనుమానిస్తున్నారు. స్థానిక మైత్రి విహార్ ఠాణా పోలీసులు అసహజ మృతి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోస్టుమార్టం తర్వాతే మృతికి గల కారణాలు తెలియవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

మర్యాదపూర్వక భేటీ





రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన చరణ్ మాఝితో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మర్యాదపూర్వకంగా శుక్రవారం భేటీ అయ్యారు. స్థానిక లోక్‌సేవ భవన్‌లో వీరిరువురు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇరు రాష్ట్రాలకు సంబంధించిన పలు అంశాలను చర్చించినట్లు ముఖ్యమంత్రి వర్గాల సమాచారం. ప్రధానంగా నాయిని బొగ్గు గనిలో పనుల ప్రారంభం మరియు నిర్వహణ గురించి ప్రస్తావించారు.

– భువనేశ్వర్

బడ్జెట్‌కు తుది మెరుగులు



సీఎం మోహన్ చరణ్ ఆధ్వర్యంలో బడ్జెట్‌పై చర్చిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: అసెంబ్లీలో ప్రవేశపెట్టేందుకు 2024–25 ఆర్థిక సంవత్సరపు సంపూర్ణ బడ్జెట్‌కు తుది మెరుగులు దిద్దుతున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఆర్థిక శాఖ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన మంత్రులు, అనుబంధ అధికారులతో శుక్రవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వీరందరితో కొత్త బడ్జెటు రూపు రేఖలపై చర్చించారు. ఈ చర్చలో ఇరువురు ఉప ముఖ్యమంత్రులు కనకవర్ధన్ సింగ్ దేవ్, ప్రభాతి పరిడాలు పాలుపంచుకున్నారు. ఈ ఏడాది ప్రవేశ పెట్టబోతున్న కొత్త ఆర్థిక సంవత్సరపు బడ్జెట్‌లో సామాన్య ప్రజల సంక్షేమం, రాష్ట్ర ఆత్మ గౌరవం, అభివృద్ధే ధ్యేయంగా కేటాయింపులు ఉంటాయని సీఎం తెలియజేశారు.

త్వరలో రత్న భాండాగారం కార్యచరణ

● రాష్ట్ర న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్

భువనేశ్వర్: రత్న భాండాగారం తెరవడం కోసం జస్టిస్ బిశ్వనాథ్ రథ్ ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి కమిటీ సిఫార్సు చేసిన నిర్ధారిత కార్యాచరణ (ఎస్ఓపీ) ఒకటి లేదా రెండు రోజుల్లో బహిరంగ పరచనున్నారు. ఈ మేరకు రాష్ట్ర న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ మీడియాతో మాట్లాడుతూ.. రత్న భాండాగారం తెరిచేందుకు సంబంధించిన ఎస్ఓపీ పరిశీలిస్తున్నామని, శనివారం నాటికి ప్రభుత్వం స్పష్టం చేస్తుందన్నారు. అత్యున్నత స్థాయి కమిటీ సిఫార్సు చేసిన ఎస్ఓపీ ప్రభుత్వం క్షుణ్ణంగా పరిశీస్తోందని పేర్కొన్నారు. దీనిపై చట్టపరమైన కోణంతో సహా వివిధ అంశాలు విశ్లేషించబడుతున్నాయన్నారు. కాగా ఒరిస్సా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బిశ్వనాథ్ రథ్ ఆధ్వర్యంలో రత్న భాండాగారం కమిటీ ఈనెల 14న నిధిని తెరవాలని ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. ఈ ప్రతిపాదనను ఆలయ పాలక మండలి కూడా ఆమోదించింది. 16 మంది సభ్యులతో కూడిన రత్న భాండాగారం తనిఖీ ఉన్నత స్థాయి కమిటీ ఈనెల 9న జరిగిన మొదటి సమావేశంలో ఎస్ఓపీ సిద్ధం చేసింది.

పాహండి దుర్ఘటనపై చర్యలు

అడపా పాహండీ దుర్ఘటనపై ప్రభుత్వం గురువారం నుంచి ప్రాథమిక చర్యలు చేపట్టిందని న్యాయశాఖ మంత్రి తెలిపారు. తదుపరి విచారణ జరుగుతోందని, తదనుగుణంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. శ్రీ మందిరం ప్రధాన పాలన అధికారి (సీఏఓ) వీర్ విక్రమ్ యాదవ్‌ని తొలగించి, ఆయన స్థానంలో అరబింద పాఢిని నియమించారు. లోగడ ఆయన శ్రీ మందిరం సీఏఓగా బాధ్యతలు నిర్వహించారు.

మిఠాయి తయారీ ఆరంభం



పొడొ పిఠా తయారు చేస్తున్న దృశ్యం

● బహుడాలో జగన్నాథుడికి సమర్పణ

భువనేశ్వర్: బహుడా యాత్రలో శ్రీమందిరానికి తిరుగు ప్రయాణంలో, మహా ప్రభువు శ్రీజగన్నాథుడు తన పిన్ని చేతి వంట మిఠాయి పొడొ పిఠా ఆరగిస్తాడు. గుండిచా నుంచి శ్రీమందిరానికి మారు రథయాత్ర పురస్కరించుకుని మార్గమధ్యలో పిన్నమ్మని పలకరించేందుకు ఆమె ఆలయం ఆవరణలో నందిఘోష్ రథం ఆగుతుంది. ఈ స్వల్ప నిడివిలో మౌసీ మా (పిన్నమ్మ) గుడిలో తయారు చేసిన పొడొ పొఠాని రథంపై శ్రీజగన్నాథునికి సమర్పించడం ఆచారంగా కొనసాగుతుంది. ఈ ఆచార వ్యవహారం కోసం మిఠాయి తయారీ ప్రారంభించారు.

పొడొ పిఠా విభిన్నం

మౌసీ మా అర్చకుడు విశ్వనాథ్ మిశ్రా ఈ ఈ వంటకం తయారీ కోసం సన్నాహాలు ప్రారంభించారు. పొడొ పిఠా తయారీ కూడా ప్రత్యేకమైనది. ఈ విషయమై మిశ్రా మాట్లాడుతూ.. పొడొ పిఠా తయారీకి ముందు గోధుమ పిండిలో చెన్నా, పంచదార, పిస్తా పప్పు, ఏలకులు, లవంగాలు, శుద్ధ నెయ్యి తదితరాలను బాగా కలగలిపి మిశ్రమం తయారు చేస్తారు. ఈ మిశ్రమాన్ని ఒక పాత్రలో విస్తరించి కొలిమిపై సుమారు 8 గంటలు ఉడకబెట్టి దించుతారు. బాగా చల్లారిన తర్వాత ఉడికిన మిశ్రమాన్ని బయటకు తీసి ముక్కలుగా కోసి మరిగిన శుద్ధ నెయ్యిలో దేవుతారు. దీంతో పొడొ పొఠా శ్రీజగన్నాథుని కోసం సిద్ధమవుతుంది. రథాలపై దేవుళ్లకు సమర్పించేందుకు ఈ ముక్కలను 3 వేర్వేరు మట్టి పాత్రల్లో పేర్చుతారు. దీనికోసం శ్రీ మందిరం పాలక మండలి విశ్వనాథ్ మిశ్రాకు పూజకుడిగా అనుమతిని జారీ చేసింది. పొడొ పిఠా తయారీ కోసం దేవస్థానం రూ.3,500 విడుదల చేసింది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజల కోసం విశ్వనాథ్ మిశ్రాకు ప్రత్యేక పూజారి గుర్తింపు కార్డును కూడా జారీ చేశారు.

క్లుప్తంగా

'రెండో శనివారం సెలవు అమలు చేయాల్సిందే'

శ్రీకాకుళం: ప్రతి నెలా రెండో శనివారం సెలవును అన్ని యాజమాన్యాల జూనియర్ కళాశాలలు, పాఠశాలలు అమలు చేసేలా జిల్లా ఆర్ఐఓ, విద్యాశాఖాధికారులు దృష్టి నిలిపి చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాలు జారీ చేసినట్లు ఆ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సెలవు అమలులో ఏ యాజమాన్యానికి ఎలాంటి మినహాయింపులు ఉండబోవని, పక్కాగా అమలు జరిగేలా సంబంధిత శాఖల అధికారులతో ప్రత్యేక పరిశీలన బృందాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇప్పటికే ఈ సెలవు పక్కాగా అమలు కోరుతూ తమ కమిషన్‌కు విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, బాలల హక్కుల సంఘాల నుంచి వినతులు, సూచనలు లేఖల రూపంలో అందుతున్నాయని తెలిపారు. కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు నేతృత్వంలో వీటిని పరిశీలించి చర్యలు చేపట్టేలా సంబంధిత జిల్లాల ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, నేరుగా తమకు ఫిర్యాదులు పంపించవచ్చునని సీతారాం తెలియజేశారు.

నేటితో ముగియనున్న పాలీసెట్ రెండో విడత కౌన్సెలింగ్

ఎచ్చెర్ల క్యాంపస్: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన పాలీసెట్ రెండో విడత కౌన్సెలింగ్‌లో భాగంగా శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ధ్రువీకరణ పత్రాల పరిశీలన కొనసాగుతోంది. సహాయ కేంద్రంలో గురువారం ప్రారంభమైన ఈ పరిశీలన శనివారంతో ముగియనుంది. పరిశీలనకు శుక్రవారం 40 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం రెండు రోజుల్లో 70 మంది హాజరయ్యారు. మరో పక్క మొదటి విడత సీట్లు లభించిన విద్యార్థులకు సైతం కళాశాలలు, బ్రాంచ్‌లు ఆప్షన్లు మార్చుకునే వెసులుబాటు ఉంది. 14వ తేదీలోపు ఆప్షన్లు ఎంచుకోవాల్సి ఉంటుంది. 16న సీట్లు అలాట్ మెంట్, 20 లోపు కళాశాలలకు అటాచ్‌మెంట్ ఆర్డర్లు అందజేయాల్సి ఉంటుంది. కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రిన్సిపాల్ దామోదర్‌రావు, అధ్యాపకులు మురళీకృష్ణ పర్యవేక్షిస్తున్నారు.

జిల్లాలో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అరసవల్లి: జిల్లాలో పలు విద్యుత్ సబ్‌స్టేషన్ల మరమ్మతు పనుల కారణంగా 28 సెక్షన్ల పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లుగా జిల్లా సర్కిల్ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి తెలియజేశారు. టెక్కలి డివిజన్‌లో ఎల్ఎన్ పేట, గంగువాడ, పోలాకి, గొప్పిలి, నౌపడ, టెక్కలి, మదనాపురం, నిమ్మాడ, చల్లవానిపేట, నౌతల తదితర సబ్‌స్టేషన్లు, అలాగే పలాస డివిజన్‌లో కాశీబుగ్గ, పలాస, పూండీ, హరిపురం, సోంపేట, బోరువంక, కంచిలి, ఇచ్ఛాపురం సబ్‌స్టేషన్లు, అలాగే శ్రీకాకుళం డివిజన్‌లో పార్వతీశంపేట, తొగరాం, అలికాం, కళింగపట్నం, ఎఎస్ఎన్.కాలనీ, అదపాక, మదనాపురం సబ్‌స్టేషన్లు, అలాగే పాలకొండ డివిజన్‌లో లుంబూరు, సీతంపేట, భామిని సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 8 గంటల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోనుందని ఆయన తెలియజేశారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

అయ్యప్పనగర్‌లో చోరీ యత్నం

టెక్కలి రూరల్: స్థానిక అయ్యప్పనగర్‌లో గురువారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. అర్ధరాత్రి సమయంలో అయ్యప్పనగర్‌లో కొంత మంది ఇళ్లలో ప్రవేశించి చోరీకి పాల్పడుతుండగా గుర్తించిన స్థానికులు కేకలు వెయ్యడంతో ఆ వ్యక్తులు అక్కడి నుంచి తప్పించుకునే ప్రయత్నం చేశారు. దాంతో స్థానికులు ఆ వ్యక్తులపై రాళ్లతో దాడి చెయ్యడంతో వారు సమీప జాతీయ రహదారిపైకి వెళ్లిపోయినట్లు స్థానికులు తెలిపారు. ఈ చోరీ ప్రయత్నం జరిగిన ప్రాంతంలోనే టెక్కలి రూరల్ సీఐ సూర్యచంద్రమౌళి నివాసముంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

జలుమూరు: లింగాలవలస వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పోలాకి మండలం మబగాం గ్రామానికి చెందిన కొర్ను సూర్యనారాయణకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సూర్యనారాయణ ఎల్ఎన్‌పేట మండలం కృష్ణాపురంలోని తన బంధువుల ఇంటికి వెళ్లి వస్తుండగా నరసన్నపేట నుంచి పాతపట్నం వెళ్తున్న వ్యాన్ ఢీకొట్టింది. దీంతో ఆయన కుడికాలు విరిగింది. స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది వచ్చి క్షతగాత్రుడిని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. సూర్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సీ రాజశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొత్తమ్మ తల్లి ఆలయంలో వేలం పాటలు ఖరారు

కోటబొమ్మాళి: కొత్తమ్మ తల్లి ఆలయంలో అమ్మవారి ఫొటోలు, రక్షల అమ్మకానికి రెండేళ్ల కాల పరిమితికి గాను రూ.3,31,100, అలాగే భక్తులు సమర్పించిన చీరలు, జాకెట్లు పొందేందుకు రూ.82,500లు, కొబ్బరి ముక్కలు పొందేందుకు రూ.2,65,100కు దేవదాయ శాఖ అధికారులు వేలం పాటలు ఖరారు చేశారు. కోటబొమ్మాళికి చెందిన దేవాది అప్పలనాయుడు, ఉర్జాన కొండలరావు, ఉర్జాన రాములకు ఈ వేలం పాటలు ఖరారయ్యాయి. ఆలయ ఈఓ వి.రాధాకృష్ణ, ఆలయ చైర్మన్ బోయిన మాధవి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వామనావతారంలో జగన్నాథుడు



రాయగడ: వామనావతారంలో దర్శనమిస్తున్న జగన్నాథుడు



రాయగడ: గుణుపూర్‌లో హోమం నిర్వహిస్తున్న దృశ్యం



పర్లాకిమిడి: వామన, పరశురామ అవతారాల్లో జగన్నాథ, బలభద్రులు



రాయగడ: గుణుపూర్‌లో వామన, పరశురామ అవతారాల్లో జగన్నాథ, బలభద్రుడు

రాయగడ: గుండిచా మందిరంలో కొలువై ఉన్న భక్తులకు వివిధ రూపాల్లో దర్శనమిస్తున్న జగన్నాథుడు శుక్రవారం వామన, బలరాముడు, పరశురాముడు అవతారాల్లో దర్శనమిచ్చారు. అలాగే జిల్లాలోని గుణుపూర్‌లో ఉన్న బ్రాహ్మణ సమాజం ఆధ్వర్యంలో గుండిచా మందిరంలో రథయాత్ర సందర్భంగా ప్రత్యేక హోమాలను నిర్వహిస్తున్నారు. గత రెండు రోజులుగా కొనసాగుతున్న ఈ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది.

పర్లాకిమిడి: గుండిచా మందిరంలో శ్రీజగన్నాథ, బలరామ స్వాములు వామన, పరశురామ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి తండోపతండాలుగా యాత్రికులు విచ్చేసి దేవతామూర్తులను దర్శించుకున్నారు.

శివారుకు సాగునీరు అందిస్తాం

- పిల్ల కాలువల పనులు ఉపాధి హామీలో పూర్తి చేసుకోండి
- డిసెంబర్‌లో వంశధార ప్రాజెక్టు పనులు ప్రారంభం
- 'సాక్షి'తో బీఆర్ఆర్ వంశధార ప్రాజెక్టు ఎస్ఈ బి.రాంబాబు



ఇంటర్వ్యూ

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఖరీఫ్‌లో శివారు ఆయకట్టుకు కూడా సాగునీరు అందిస్తామని బీఆర్ఆర్ వంశధార ప్రాజెక్టు ఎస్ఈ బి.రాంబాబు తెలిపారు. ఈ ఏడాది డిసెంబర్‌లో వంశధార ప్రాజెక్టుతో పాటు హిరమండలం రిజర్వాయర్‌ను ప్రారంభించేందుకు, లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఉపాధి హామీ పనుల్లో ప్రతీ గ్రామంలో పిల్ల కాలువలు శుభ్రం చేయాలని సూచించారు. 'సాక్షి'తో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు.

సాక్షి: వంశధార కాలువల్లో పూడిక బాగా పేరుకుపోయింది. దీనిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

ఎస్ఈ: పూడిక తీత పనులకు చర్యలు తీసుకున్నాం. 0 నుంచి 104 కిలోమీటర్లు గుర్రపు డెక్క తీసేందుకు చర్యలు చేపట్టాం. చిన్న చిన్న వంతెనలు, స్పిల్‌వేలు మరమ్మతులు చేసేందుకు ఇప్పటికే రూ.50లక్షలు ఖర్చు చేశాం. ఇంకా మిగిలిన చిన్న చిన్న పనులను ఉపాధి హామీ పనుల ద్వారా చేస్తున్నాం.

సాక్షి: షట్టర్లు పాడై ఉన్నాయి. గతంలో జరిగిన షట్టర్ల అవినీతి కేసు పరిస్థితి ఏంటి?

ఎస్ఈ: గతంలో నరసన్నపేటలో చోటుచేసుకున్న షట్టర్ల అవినీతి కేసు కోర్టులో పెండింగ్‌లో ఉండడంతో కొత్తవి ఏర్పాటు చేసుకోలేని పరిస్థితి నెలకొంది. దీనికి ప్రత్యామ్నాయంగా కొత్త షట్టర్లు ఏర్పాటుకి రూ.3.58కోట్లతో ప్రతిపాదనలు పంపించాం.

సాక్షి : ఆఫ్‌షోర్ పనుల పరిస్థితి ఏంటి?

ఎస్ఈ: ఆఫ్‌షోర్ పనులు గతంలో 25 శాతానికి పైగా పూర్తయ్యాయి. పాత కాంట్రాక్ట్‌ను రద్దు చేసి కొత్తగా అంచనాలు పెంచి 2023–2024లో రూ.299కోట్లుతో అగ్రిమెంట్ జరిగింది. రేగులపాడు వద్ద ఆర్‌అండ్‌ఆర్ సమస్యను పరిష్కరిస్తున్నాం. ఇప్పటికే కాంక్రీట్ వర్క్ చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం. మట్టి పనులు అధిక శాతం జరిగాయి.

సాక్షి: సాగునీటి సమస్యలకు షట్టర్లు పాడవడం, కొత్తవి ఏర్పాటు చేయకపోవడమే ప్రధాన కారణమన్న విమర్శలు ఉన్నాయి?

ఎస్ఈ: షట్టర్ల కొనుగోళ్లలో జరిగిన అవినీతిపై 2009లో సిబిఐ కేసు నమోదు చేసింది. దీనిపై నేటికీ హైకోర్టులో విచారణ సాగుతోంది. విచారణ పెండింగ్‌లో ఉండడంతో కాలువలపై కొత్త షట్టర్లను ఏర్పాటు చేసుకోలేని పరిస్థితి నెలకొంది. దీంతో కొత్తగా షట్టర్లు ఏర్పాటు చేసుకోలేక, పాడైన వాటితోనే నెట్టుకురావాల్సిన పరిస్థితి నెలకొంది. పలు సందర్భాల్లో ప్రజాప్రతినిధుల దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లాం. ప్రభుత్వం చొరవ చూపితే. సమస్య పరిష్కారమయ్యే అవకాశముంది. నాగావళి-వంశధార నదుల అనుసంధాన పనులు ఇప్పటివరకు 78 శాతం పూర్తయ్యాయి.

సాక్షి: హిరమండలం లిఫ్ట్ పనులు ఎంతవరకు వచ్చాయి?

ఎస్ఈ: వంశధార ఫేజ్–2, స్టేజ్–2 పనులు పూర్తి స్థాయిలో వినియోగంలోకి వచ్చేలోపే రైతులకు సాగునీరు ఇచ్చేందుకు రూపొందించిన లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్. డ్రాయింగ్, డిజైన్లు పూర్తయ్యాయి. పంపులు, మోటార్లు ఇప్పటికే వచ్చేశాయి. పనులు మరింత వేగవంతం చేసి రబీ నాటికి పనులు పూర్తిచేస్తాం.

సాక్షి: స్టేజ్–2, ఫేజ్–2 పనుల పరిస్థితి ఏంటి?

ఎస్ఈ: ప్యాకేజీ–87, 88 పనులు దాదాపు పూర్తయ్యాయి. హిరమండలం రిజర్వాయర్ పనులు 93 శాతం జరిగాయి. ప్రస్తుతం స్పిల్‌వే పనులు జరుగుతున్నాయి. ఈ ఏడాదిలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. గొట్టా బ్యారేజీ వద్ద ఇసుక కొట్టుకుపోయి రాతి పరుపు (ఏప్రాన్) పాడైంది. దాన్ని పునర్నిర్మించేందుకు రూ. 15 కోట్లు అంచనా వ్యయంతో ప్రతిపాదనలు పంపించాం. ఇంకా ఆమోదం రావాల్సి ఉంది. ఈ పనులు పూర్తిచేసి నదికి దిగువభాగంలో ఉండేందుకు రక్షణ కల్పిస్తాం.

సాక్షి: సాగు సాఫీగా చేసుకునేందుకు ఏం చేయాలనుకుంటున్నారు?

ఎస్ఈ: కాలువల్లో గుర్రపు డెక్క పెద్ద ఎత్తున పెరగడంతో సాగునీటి ప్రవాహానికి ఇబ్బందులు తలెత్తిన మాట వాస్తవమే. గుర్రపు డెక్క తొలగింపునకు రూ.50 లక్షల వరకు నిధులు ఖర్చుచేశాం. వంశధార, కుడి ఎడమ కాలువలకు మొత్తం 260 మంది లష్కర్లు కావాలి, సుమారు వందమంది వరకు పనిచేస్తున్నారు. సాగునీటి రెగ్యులేషన్ కోసం జిల్లా అవసరాల దృష్ట్యా 130 మంది కావాలని ప్రభుత్వాన్ని అడిగాం. ప్రభుత్వం అనుమతిస్తే అదనంగా లష్కర్లను నియమిస్తాం. లేకుంటే పాత వారినే మళ్లీ కొనసాగిస్తాం.

సాక్షి: ఆధునికీకరణ పనులు ఎప్పుడు చేపడతారు?

ఎస్ఈ: శిథిలావస్థలో ఉన్న వంశధార ఎడమ కాలువ పనులు చేపట్టకుంటే శివారు ప్రాంతాలకు ఆశించిన స్థాయిలో సాగునీరందించడం కష్టమే. దశల వారీగా చేపట్టాల్సిన పనులకు సంబంధించి రూ.1000 కోట్ల అంచనా వ్యయంతో ప్రభుత్వానికి నివేదిక పంపించాం. అందుకు డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డిపిఆర్) తయారుచేశాం. మొదటి దశలో అండర్ టన్నెల్స్, ఆఫ్ టేక్ స్లూయిజ్‌లు తక్షణం పునఃనిర్మించాల్సి ఉంది. నిధులు రాగానే పనులు ప్రారంభిస్తాం.

సాక్షి: వానలు పడడం లేదు. ప్రత్యామ్నాయ చర్యలు ఏంటి?

ఎస్ఈ: వర్షాలు పడతాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. వర్షాలు కురిసిన వెంటనే ప్రతి సెంటుకి నీరిచ్చేందుకు చర్యలు చేపడతాం. ఏ ఒక్క రైతు దిగులు చెందాల్సిన అవసరం లేదు. శివారు వరకు నీరిచ్చే తీరుతాం.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు



క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గొమాంగో



గాయపడిన బాలుడు

రాయగడ: జిల్లాలోని రామనగుడ సమితి కొండజామ వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు తీవ్రగాయాలకు గురయ్యారు. గుమడ లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన ఒకే కుటుంబంలోని నలుగురు వ్యక్తులు బొలేరోలో రాయగడ వైపు వస్తుండగా, కొండజామ గ్రామ సమీపంలో అదుపుతప్పి ఎదురుగా వస్తున్న బైకును ఢీకొంది. దీంతో బొలేరోలో ప్రయాణిస్తున్న వారు తీవ్రగాయాలకు గురయ్యారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను రామనగుడ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. అదే సమయంలో రామనగుడ నుంచి గుణుపూర్‌కు వెళ్తున్న గుణుపూర్ ఎమ్మెల్యే సత్యజీత్ గొమాంగో విషయాన్ని తెలుసుకుని రామనగుడలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. అయితే క్షతగాత్రుల వివరాలు తెలియాల్సి ఉంది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'శాస్త్రీయంగా నిధుల పంపిణీ'



మాట్లాడుతున్న ఆర్థిక సంఘు కార్యదర్శి రమణారెడ్డి

అరసవల్లి: స్థానిక సంస్థలకు నిధుల కేటాయింపు విషయంలో అంతా శాస్త్రీయబద్ధంగా జరగాలని ఐదో రాష్ట్ర ఆర్థిక సంఘ సభ్య కార్యదర్శి ప్రొఫెసర్ కేవీ రమణారెడ్డి సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీఓలు, ఈఓపీఆర్డీలు, మున్సిపల్ కమిషనర్లతో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆర్థిక సంఘ కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ ఎం.ప్రసాదరావు, ప్రొఫెసర్ ఎంవీఎస్ పద్మారావు, కె.కృపారావులతో కలిసి నిర్వహించిన ఈ సమావేశంలో ఆయన పలు అంశాలతో పాటు నిధుల కేటాయింపు, పంపిణీ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. రాష్ట్ర ఆర్థిక సంఘం వివరణాత్మక నిబంధనలను అమలు చేస్తుందని, దీంతో స్థానిక సంస్థలకు న్యాయబద్ధంగా సమాన నిష్పత్తిలో నిధుల పంపిణీ జరుగుతుందని వివరించారు. గ్రామ పంచాయతీలు, జిల్లా పరిషత్, మండల పరిషత్‌లు పన్ను వర్తింపు సమస్యలు, వ్యయ సమస్యలు, ప్రాథమిక అవసరాల లభ్యత, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాల భాగస్వామ్యం, రశీదులు, ఖర్చులు తదితర వివరాలను అధికారులు పూర్తి స్థాయి సమాచారాన్ని సిద్ధం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ వెంకటేశ్వరరావు, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఈఓ వెంకట్ రామన్ తదితరులు పాల్గొన్నారు.

● రామావతారంలో..



జగన్నాథ రథయాత్ర మహోత్సవాల్లో భాగంగా ఆరో రోజు శుక్రవారం రామావతారంలో జగన్నాథ స్వామి భక్తులకు దర్శనం ఇచ్చారు. స్థానిక వెంకటేశ్వరాలయం, పెద్దపేట రామాలయం, లకిమేర ఉమారామలింగేశ్వర స్వామి ఆలయాల్లో రామావతారంలో ఉన్న జగన్నాథ స్వామిని భక్తులు అధిక సంఖ్యలో దర్శనం చేసుకున్నారు.

–నరసన్నపేట

● తప్పని నిరీక్షణ



టెక్కలిలో ఇసుక కోసం రాత్రి వేళ నడిరోడ్డుపై ట్రాక్టర్లు వదిలేసిన దృశ్యం

టెక్కలి స్టాక్ పాయింట్ వద్ద ఇసుక కావాలంటే రాత్రిపగలు పడిగాపులు కాయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. సాయంత్రం 6 గంటలకే స్టాక్ పాయింట్ వద్ద అమ్మకాలు నిలిపి వేస్తుండడంతో, ఇసుక అవసరమైన వాహనదారులు తమ వాహనాలను నడిరోడ్డుపై వదిలేసి ఇళ్లకు వెళ్తున్నారు. ఇదేం ఖర్మరా బాబూ అంటూ ఆయా వాహనదారులు ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారు.

– టెక్కలి

బైక్‌లు చోరీ చేస్తున్న ఇద్దరు అరెస్ట్

ఆమదాలవలస: జిల్లాలోని పలు ప్రాంతాల్లో బైక్‌లు దొంగిలిస్తున్న ఇద్దరిని ఆమదాలవలస ఫ్లై ఓవర్ సమీపంలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద పట్టుకుని అరెస్టు చేసినట్లు ఆమదాలవలస సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి. దివాకర్ వాయునందన్ యాదవ్ తెలిపారు. నిందితులను పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఆమదాలవలస పోలీస్ స్టేషన్ పరిధిలో జొన్నవలస, మెట్టక్కి వలస ప్రాంతాలలో రెండు ద్విచక్ర వాహనాలు చోరీకి గురైనట్లు ఫిర్యాదులు అందాయని తెలిపారు. వీటిపై ఎస్పీ జీఆర్ రాధిక సకాలంలో స్పందించి కేసులు పరిష్కరించాలని ఆదేశించడంతో ఎస్ఐ వెంకటేష్‌తో పాటు మరో నలుగురు పోలీసు సిబ్బందితో ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శుక్రవారం పట్టణ శివారున ఉన్న వైఎస్ఆర్ జంక్షన్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా శ్రీకాకుళం పట్టణానికి చెందిన బొమ్మలాట మోహన్, తోట శ్రీనివాసరావు అనే ఇద్దరు వ్యక్తులు చోరీకి గురైన ద్విచక్ర వాహనాలపై రావడం గుర్తించి పట్టుకున్నామని పేర్కొన్నారు. వీరిద్దరినీ విచారించగా జొన్నవలస, మెట్టక్కివలస, ఎచ్చెర్లకు సంబంధించిన మూడు ద్విచక్రవాహనాలతో పాటు మరో మూడు ద్విచక్ర వాహనాలు లభించాయని తెలిపారు. అలాగే జిల్లాలోని శ్రీకాకుళం లావేరు నరసన్నపేట పోలీస్ స్టేషన్లలో కూడా వీరిద్దరిపై పలు కేసులు నమోదైనట్లు సీఐ తెలిపారు. ద్విచక్ర వాహనాల కేసును త్వరగా ఛేదించిన ఎస్ఐ వెంకటేష్‌తో పాటు కానిస్టేబుల్ నాయుడు, శ్యామ్, బాలును సీఐ యాదవ్ అభినందించి రివార్డులను అందజేశారు.

ఆర్‌సెట్ సమీక్షలో పాల్గొన్న వీసీ

ఎచ్చెర్ల క్యాంపస్: పరిశోధన ప్రవేశాలకు శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం మే మొదటి వారంలో ఆర్‌సెట్ నిర్వహించింది. ఆర్‌సెట్ ప్రవేశాలకు సంబంధించి వర్చువల్‌గా రాష్ట్రస్థాయిలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ కె.ఆర్.రజిని హాజరయ్యారు. ఉన్నత విద్యామండలి ఆర్ సెట్ ప్రవేశాలు నిబంధనలు వివరించింది. ఈ నెల 24 నుంచి పీహెచ్‌డీ ప్రవేశాలు నిర్వహించనున్నట్లు ఉన్నత విద్యా మండలి అధికారులు వివరించారు. వర్సిటీలో ఖాళీలు తెలియజేయాలని సూచించారు.

రిమ్స్‌లో 'సీటు' పాట్లు

- రిమ్స్ వైద్యుల నిర్వాకంతో మంజూరు కాని వైద్యసీట్లు
- తరచూ విధులకు గైర్హాజవుతుండడంతో నిరాకరించిన ఎన్‌సీఐ

శ్రీకాకుళం: ఏ విద్యా సంస్థలో అయినా విద్యార్థుల హాజరు తక్కువగా ఉంటే ఆ విద్యార్థిని పరీక్షలకు పంపించకుండా ఆపుతారు. కానీ శ్రీకాకుళం రిమ్స్ కళాశాలలో కొందరు వైద్యుల నిర్వాకం వల్ల పేద విద్యార్థులు నష్టపోతున్న దుస్థితి ఏర్పడింది. వివరాల్లోకి వెళితే... రిమ్స్ ఆస్పత్రి, వైద్య కళాశాలలో గత ప్రభుత్వం అనేక సౌకర్యాలను కల్పించటంతో 57కు పైగా పీజీ సీట్లు మంజూరయ్యాయి. అలాగే 50 వరకు ఎంబీబీఎస్ సీట్లు మంజూరయ్యాయి. దీంతో గత విద్యా సంవత్సరం నాటికి ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య 150 చేరింది. మరో 50 సీట్లు పెరిగేందుకు కూడా తగిన సౌకర్యాలు ఉండటంతో అందుకోసం ప్రభుత్వ సూచనలు మేరకు రిమ్స్ యాజమాన్యం ఎన్‌సీఐకి దరఖాస్తు చేసింది. కొద్ది నెలల కిందట పరిశీలనకు వచ్చిన ఎన్‌సీఐ బృందం రిమ్స్‌లో కొందరు వైద్యులు విధులకు సక్రమంగా హాజరు కాకపోవటం, తరుచూ సెలవులు పెట్టడంతో ఓపీ, శస్త్రచికిత్సలు, ఇన్ పేషెంట్ల సంఖ్య తక్కువగా ఉండడం గమనించింది. ఇదే విషయాన్ని తెలుపుతూ అన్ని సౌకర్యాలు అదనపు సీట్ల కేటాయింపునకు అనువుగా ఉన్నప్పటికీ వైద్యుల హాజరు, ఓపీ తక్కువగా ఉండటంతో అదనపు సీట్లు మంజూరు చేయలేమని తేల్చి చెబుతూ రిమ్స్ యాజమాన్యానికి ఎన్‌సీఐ లేఖ పంపించింది.

దీంతో రిమ్స్ అధికారులు ఓపీ, ఇన్ పేషెంట్లు, శస్త్రచికిత్సల సంఖ్యను పెంచేందుకు దృష్టి సారించారు. న్యూరాలజీ, కార్డియాలజీ, యూరాలజీ, ఆంకాలజీ వంటి నిపుణులు సైతం రిమ్స్‌లో ఉండటంతో వీరి సేవలను మరింతగా ఉపయోగించుకోవటం ద్వారా రోగుల సంఖ్యను పెంచాలని, వైద్యులు సెలవులు పెట్టకుండా ఉండేలా నిబంధనలు తయారు చేసుకున్నారు. పనిచేసేందుకు ఇష్టం లేనివారు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిపోవాలని సూచనలు చేస్తున్నారు. మరోసారి పరిశీలనకు రావాలని ఎన్‌సీఐకి ఉన్నతాకారుల ద్వారా రిమ్స్ అధికారులు లేఖను పంపించేందుకు సిద్ధం చేస్తున్నారు. వైద్యులు సక్రమంగా హాజరైతే అదనంగా 50 ఎంబీబీఎస్ సీట్లు మంజూరయ్యేందుకు అవకాశం ఉంది. మరో 50 మంది పేద విద్యార్థులకు వైద్య విద్య అందుబాటులోకి వస్తుంది.

'తాబేలు పిల్లలను సంరక్షించాలి'



బట్టిగళ్లూరులో సముద్రంలోకి తాబేళ్ల పిల్లలను విడిచిపెడుతున్న దృశ్యం

సోంపేట: మత్స్యకారులు తాబేలు పిల్లలను సంరక్షించాలని ట్రీ ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ కె.సోమేశ్వరరావు అన్నారు. బట్టిగళ్లూరు సముద్రతీరంలో తాబేలు పిల్లల సంరక్షణ కేంద్రం నుంచి 92 సముద్ర తాబేళ్ల పిల్లలను సముద్రంలోకి శుక్రవారం విడిచి పెట్టారు. అనంతరం బట్టిగళ్లూరు ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో బట్టిగళ్లూరు ప్రభుత్వ ఆస్పత్రి వైద్యసిబ్బంది పద్మావతి, అరుణ్ కుమార్, సుందరరావు, ట్రీ ఫౌండేషన్ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎలక్ట్రికల్ దుకాణంలో చోరీ



చోరీ జరిగిన దుకాణం

శృంగవరపుకోట: పట్టణంలో వరుస చోరీలతో దొంగలు హడలెత్తిస్తున్నారు. ఇటీవల పట్టణంలో పూర్తిగా పోలీస్ పెట్రోలింగ్ కరువైంది. సుమారు మూడు నెలల పాటూ ఎన్నికల హడావిడిలో పడి పోలీస్ యంత్రాంగం పెట్రోలింగ్, ట్రాఫికింగ్ అంశాలపై దృష్టి సారించటం మానేశారు. దీంతో పట్టణంలో దొంగల బెడద ఎక్కువైంది. గురువారం రాత్రి విశాఖ – అరుకు ప్రధాన రహదారిలో పోలీస్ స్టేషన్‌కు పొరుగున ఉన్న శ్రీవాణి ఎలక్ట్రికల్ మోటార్ రీవైండింగ్ వర్క్స్ దుకాణం తలుపు విరగ్గొట్టి దొంగలు చోరీకి పాల్పడ్డారు. రిపేరింగ్ మెటీరియల్, వస్తువులు దోచుకుపోయారు. సుమారు రూ.2లక్షల విలువైన సామగ్రి దోచుకుపోయారని షాపు యజమాని గుదే రమణ వాపోయాడు.

వాహనాలపై కేసుల నమోదు



పట్టణ శివారులో నిర్వహించిన తనిఖీల్లో పాల్గొన్న ఆర్టీసీ డీఎం కనకదుర్గ

పార్వతీపురం టౌన్: జిల్లాలో పది వాహనాలపై కేసులు నమోదు చేసామని జిల్లా రవాణా శాఖాధికారి శశికుమార్ అన్నారు. ఆర్టీసీ, జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టామన్నారు. అందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రమాదాలకు కారణం ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను తీసుకువెళ్లడం కారణమని గుర్తించామన్నారు. జిల్లాలో నిర్వహించిన తనిఖీల్లో 10 ఆటోలపై కేసులు నమోదు చేసి రూ.7వేలు అపరాధ రుసుం వసూలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం కనకదుర్గ, సిబ్బంది పాల్గొన్నారు.


రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



గాయాల పాలైన ఈశ్వరరావు

బొబ్బిలి: పట్టణంలోని రైల్వేస్టేషన్ జంక్షన్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. మండలంలోని దిబ్బగుడివలసకు చెందిన అరసాడ ఈశ్వరరావు పనిమీద పట్టణానికి వచ్చాడు. రైల్వేస్టేషన్ జంక్షన్ వద్ద గల డివైడర్‌ను ఢీకొనడంతో కిందపడి తలకు గాయమై తీవ్ర రక్తస్రావమైంది. వెంటనే స్థానికులు సపర్యలు చేసి సీహెచ్‌సీకి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. జరిగిన సంఘటనపై కేసు నమోదు చేయలేదని, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ జి.లోవరాజు తెలిపారు.

బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అప్పలనాయుడు

పార్వతీపురం టౌన్: ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలైన సంఘటన కొమరాడ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. జిల్లా ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా కరక గ్రామానికి చెందిన అనిమిరెడ్డి అప్పలనాయుడు ఉపాధి హామీ పథకంలో డీఆర్‌పీగా పని చేస్తున్నాడు. కొమరాడ నుంచి గురువారం రాత్రి నడుచుకుంటూ ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్తుండగా బాలికల హాస్టల్ డౌన్ దగ్గరకు వచ్చేసరికి వెనుక నుండి వస్తున్న బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం విశాఖపట్నం తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ వ్యాపారానికి చెక్



విజయనగరంలో తోపుడుబళ్లపై ఆహార పదార్థాలు తయారు చేస్తున్న నిర్వాహకులు

- ఆహార విక్రయాలకు లైసెన్సులు తప్పనిసరి
- నిబంధనలకు విరుద్ధంగా దుకాణాల నిర్వహణ
- ఉల్లంఘనులకు రూ.5 లక్షల జరిమానా.. 6 నెలల జైలు
- చర్యలకు సిద్ధమైన అధికార యంత్రాంగం

విజయనగరం: ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా ఎటువంటి లైసెన్సు లేకుండా ఆహార పదార్థాలు విక్రయించే వారిపై కఠిన చర్యలకు రంగం సిద్ధమైంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎటువంటి అనుమతులు లేకుండా నిబంధనలు అతిక్రమిస్తూ వ్యాపారాలు కొనసాగించే వ్యాపారులపై జిల్లా ఆహార కల్తీ, నియంత్రణ అధికారులు కొరడా ఝుళిపించనున్నారు. ఇప్పటివరకు ఆహార పదార్థాల కల్తీపై ప్రత్యేక దృష్టి సారించిన అధికార యంత్రాంగం ప్రతి ఏడాది మాదిరిగానే లైసెన్సులు ఉన్న వారే ఆహార విక్రయాలకు అర్హులని చెబుతోంది. ఒకవేళ లైసెన్స్ లేకుండా అమ్మకాలకు పాల్పడిన వారికి రూ.5 లక్షల జరిమానాతో పాటు 6 నెలల జైలుశిక్ష విధించనున్నామని అధికారులు పేర్కొంటున్నారు.

పుట్టగొడుగుల్లా విక్రయ కేంద్రాలు

జిల్లా వ్యాప్తంగా పుట్టగొడుగుల్లా ఆహార పదార్థాల విక్రయ కేంద్రాలు వెలుస్తున్నాయి. చిన్నపాటి జంక్షన్‌లలో కూడా నాలుగైదు తోపుడు బళ్లపై ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు నిర్వహిస్తున్నారు. ఒకింత పెద్ద జంక్షన్ అయితే ఏకంగా పదుల సంఖ్యలో ఆ తరహా సెంటర్లు నిర్వహణ కనిపిస్తుండడం గమనార్హం. అంతే కాకుండా చిన్నపాటి గదులను అద్దెకు తీసుకుని మరీ పకోడి, టిఫిన్ షాపులు, నూడిల్స్, పానీపూరి అమ్మకాలు కొనసాగిస్తున్నారు. పెద్దపెద్ద రెస్టారెంట్లు, హోటళ్లు అయితే వేల సంఖ్యలోనే కనిపిస్తున్నాయి.

ఏటా లైసెన్స్ రెన్యువల్ తప్పనిసరి

ప్రభుత్వ నిబంధనల మేరకు ఏడాదిలో రూ.12 లక్షల ఆదాయం వచ్చే హోటళ్లు, రెస్టారెంట్లు రూ.2వేలు చెల్లించి తమ లైసెన్స్‌లను ఏటా రెన్యువల్ చేయించుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం అధికారిక సమాచారం ప్రకారం జిల్లాలో 955 మంది లైసెన్స్‌లు పొందినట్లు తెలుస్తోంది. తద్వారా రూ.34.50 లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఏడాదిలో రూ.12 లక్షలలోపు ఆదాయం సంపాదించే చిన్నపాటి దుకాణాలు నిర్వహించే వారు ఏడాదికి రూ.500 మాత్రమే చెల్లించి, లైసెన్స్‌లు రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ లెక్కన అధికారికంగా నిర్వహించే దుకాణాల కన్నా అనధికారికంగా నిర్వహించే దుకాణాలే ఎక్కువన్న విషయం స్పష్టమవుతోంది. ఈ నేపథ్యంలో వాటిపై చర్యలకు అధికారులు సన్నద్ధమవుతున్నారు.

266 కేసుల నమోదు

ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుతున్న అక్రమ వ్యాపారులకు వ్యతిరేకంగా అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నట్లు చెబుతున్నారు. గడిచిన సంవత్సరంలో 260 కేసులు మాత్రమే నమోదు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. వీటిలో కొన్నింటిని జేసీ కోర్టుకు, మరికొన్నింటిని జిల్లా కోర్టుకు నివేదించినట్లు సమాచారం.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



ఆహార పదార్థాలు విక్రయించే వ్యాపారులకు లైసెన్స్ లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రజలకు అనారోగ్యం కలిగించేలా ఆహార పదార్థాలు కల్తీ చేసినా, అక్రమంగా అమ్మకాలు కొనసాగించినా జరిమానాతో పాటు జైలు శిక్ష విధిస్తాం.

– ఈశ్వరి, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్, విజయనగరం జిల్లా

పర్యాటక పనులు సకాలంలో పూర్తి చేయాలి



ఆడలిలో సూచనలిస్తున్న ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

- ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓ విష్ణుచరణ్

సీతంపేట: పర్యాటక పనులు సకాలంలో పూర్తి చేయాలని సీతంపేట ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓ విష్ణు చరణ్ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక ఐటీడీఏకు వచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరం, గిరిజన సంక్షేమ శాఖ, ఇంజినీరింగ్, హార్టికల్చర్, ఆర్‌టీఎఫ్‌ఆర్, వెలుగు తదితర కార్యాలయాలను పరిశీలించారు. ఎవరెవరు ఏఏ కేడర్‌లలో పని చేస్తున్నారో సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆడలి వ్యూ పాయింట్‌ను సందర్శించారు. పనులు నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ సిబ్బందికి సూచించారు. అలాగే సుందరయ్యగూడలో నిర్మిస్తున్న గోకులాన్ని పరిశీలించారు. ట్రైబుల్ మ్యూజియం నిర్మాణ పనులు ఏ మేరకు చేశారో చూశారు. తురాయిపువలస నర్సరీ యూనిట్‌ను సందర్శించారు. అక్కడ ఏఏ మొక్కలు రైతులకు విక్రయిస్తున్నారు, ఎంత విస్తీర్ణంలో ఫారం ఉందో తెలుసుకున్నారు. ఐటీడీఏ ఇండోర్ స్టేడియం, జిమ్‌లను పరిశీలించారు. ఆయన వెంట ఏపీఓ చిన్నబాబు, ఈఈ సింహాచలం, డీఈ కృష్ణకుమార్, గిరిజన సంక్షేమ శాఖ డీడీ అన్నదొర, ఏటీడబ్ల్యూఓ మంగవేణి, డీడీఈఓ నారాయుడు, ఏఎంఓ కోటిబాబు, సీఏంఓ చిరంజీవులు తదితరులు ఉన్నారు.

తూకంలో తేడా వస్తే ఫిర్యాదు చేయండి

- జిల్లా అగ్రి టీడ్, మార్కెటింగ్ ఆఫీసర్

సాక్షి ఎఫెక్ట్...

విజయనగరం ఫోర్ట్: కంది పప్పు తూకంలో తేడా వస్తే ఫిర్యాదు చేయాలని జిల్లా అగ్రిటేడ్ మార్కెటింగ్ ఆఫీసర్ ఏడీ రవికిరణ్ సూచించారు. దాసన్నపేట రైతుబజారులో కంది పప్పు తూకంలో తేడా ఉన్న అంశంపై సాక్షిలో శుక్రవారం కేజీకి 920 గ్రాములేనట శీర్షికన ప్రచురించిన కథనానికి స్పందించారు. రైతు బజారులో ఒక ప్యాకెట్ తూకంలో కంది పప్పు తక్కువగా ఉంటే వెంటనే సరి చేసుకున్నామని తెలిపారు. ఏ రైతు బజారులోనైనా కంది పప్పు తక్కువగా తూకం వేసి ఇచ్చినట్టు అయితే తమకు ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా తూనికలు, కొలతలు శాఖ అధికారులు కూడా కందిపప్పు తూకాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసారని తెలిపారు.



దాసన్నపేట రైతుబజారులో కందిపప్పు ప్యాకెట్లు తూకం వేస్తున్న తూనికలు, కొలతల శాఖ అధికారులు

రామతీర్థంలో వైభవంగా సహస్ర దీపాలంకరణ



సీతారామస్వామికి దీపారాధన సేవ జరిపిస్తున్న అర్చక స్వాములు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువజామున స్వామికి ప్రాతః కాలార్చన పూజలు నిర్వహించిన తరువాత యాగశాలలో నిత్య హోమాలు, వెండి మండపం వద్ద స్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా జరిపించారు. సాయంత్రం 6 గంటలకు సీతారామస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా దీపారాధన మండపంపైకి తీసుకువచ్చి ప్రత్యేక ఊయలలో ఆశీనులు చేశారు. అనంతరం దీపాలు వెలిగించి ఊంజల్ సేవ జరిపించారు. కార్యక్రమంలో అర్చకులు సాయి రామాచార్యులు, కిరణ్, రామ గోపాల్, భక్తులు పాల్గొన్నారు.

జ్వరమొస్తే పరుగులు తీయాల్సిందేనా...



జ్వరంతో బాధపడుతున్న ఆశ్రమ పాఠశాల విద్యార్థులు

పార్వతీపురం టౌన్: ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు జ్వరం వస్తే ప్రధానోపాధ్యాయులే దిక్కవుతున్నారని విద్యార్థులు వాపోతున్నారు. ఐటీడీఏ కార్యాలయానికి, కలెక్టర్ కార్యాలయానికి 600 మీటర్ల దూరంలో చాకలి బెలగాంలో ఉన్న గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో పి.సందీప్, కె.మనోజ్ కుమార్, కె.సురేష్, సిహెచ్.నవీన్ జ్వరంతో బాధపడుతున్నారు. ఈ సందర్భంలో గురువారం రాత్రి ఆశ్రమ పాఠశాలలో జ్వరంతో బాధపడుతున్న విద్యార్థులకు వైద్యం అందించేందుకు ఏఎన్ఎం లేకపోవడంతో ప్రధానోపాధ్యాయులే జ్వరంతో బాధపడుతున్న వారిని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ఐటీడీఏకి, మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి 600 మీటర్ల దూరంలో ఉన్న బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాల పరిస్థితి ఇలా ఉంటే మరి దూర ప్రాంత గిరిజన ప్రాంతాల్లో ఉన్న ఆశ్రమ పాఠశాల పరిస్థితి ఎలా ఉంటుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి హాస్టల్‌ను పరిశీలించి ప్రతి ఆశ్రమ పాఠశాలకు ఒక ఏఎన్ఎంని నియమించి విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించే విధంగా పూర్తి స్థాయిలో భరోసా కల్పించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

రవీంద్రభారతి పాఠశాల యాజమాన్యంపై చర్యలకు డిమాండ్



డీఈఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపున్న ఏఎస్ఎఫ్ఐ

పార్వతీపురం టౌన్: రవీంద్ర భారతి పాఠశాల యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవికుమార్ డిమాండ్ చేశారు. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద శుక్రవారం ఆ సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని రవీంద్ర భారతి పాఠశాల యాజమాన్యం అడ్మిషన్ల పేరుతో 73 మంది విద్యార్థుల దగ్గర ఫీజులు వసూలు చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చిందన్నారు. గడచిన వేసవి కాలంలో పాఠశాల క్యాంపెయిన్ పేరుతో కొంతమంది ఉపాధ్యాయులు పిల్లలను పాఠశాలలో చేర్చుకునే విషయంపై పలు ప్రాంతాలలో విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద అడ్మిషన్ల పేరుతో రూ.3వేల చొప్పున నర్సరీ నుంచి 8వ తరగతి వరకు వసూలు చేసారన్నారు. అకడమిక్ సంవత్సరంలో పిల్లలను జాయిన్ చేసేందుకు తల్లిదండ్రులు రవీంద్ర భారతి పాఠశాల వద్దకు వెళ్లి చూడగా పాఠశాల మూసివేసి ఆ భవనంలో వేరే పాఠశాల వెలియడంతో తల్లిదండ్రులు అవాక్కయ్యారన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుందని, అప్పటికి యాజమాన్యం తల్లిదండ్రులకు చెల్లించాల్సిన ఫీజులు తిరిగి ఇవ్వకుంటే చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఏఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

- బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కెల్ల శ్రీనివాసరావు

విజయనగరం ఫూల్‌బాగ్: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కెల్ల శ్రీనివాసరావు కోరారు. బీసీ సంక్షేమ సంఘ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌లో బీసీ భద్రతా చట్టాన్ని అమలు చేయాలన్నారు. జిల్లాలో బీసీ భవన్ నిర్మాణానికి జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు అధికారులు కృషి చేయాలన్నారు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు ఆదేశాల మేరకు కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేశామన్నారు. బీసీల సంక్షేమనికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గొర్లె సూరిబాబు, తోటపల్లి బుజ్జిబాబు, బొబ్బాది చంద్రనాయుడు, సన్యాసి రావు పాల్గొన్నారు.

ఈఎస్ఐ ఆస్పత్రిలో అరకొర వైద్య సేవలు

- ఎక్సరే టెక్నీషియన్ లేక నిలిచిన సేవలు
- సీబీపీ పరీక్షలు చేయని వైనం
- ఈఎస్ఐ పరిధిలో 21 వేల మంది కార్మిక కుటుంబాలు



ఈఎస్ఐ డయోగ్నోస్టిక్ సెంటర్

విజయనగరం ఫోర్ట్: ఈఎస్ఐ డిస్పెన్సరీ, డయోగ్నోస్టిక్ సెంటర్‌లో కార్మికులకు అరకొర వైద్య సేవలు అందుతున్నాయి. చికిత్స కోసం వచ్చే వారికి పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు. డయోగ్నోస్టిక్ సెంటర్ పరిధిలో వేలాది మంది కార్మికులు ఉన్నారు. వీరంతా చికిత్స కోసం డయోగ్నోస్టిక్ సెంటర్‌కు వస్తారు. డయోగ్నోస్టిక్ వచ్చే వారికి పూర్తి స్థాయిలో వైద్య పరీక్షలు చేయకపోవడం వల్ల వారు ప్రైవేటు లేబొరేటరీకి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

డయోగ్నోస్టిక్ సెంటర్‌లో ఓపీ విభాగాలు

ఈఎస్ఐ డయోగ్నోస్టిక్ సెంటర్‌లో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఎముకలు విభాగం, ఆప్తామాలజీ, గైనిక్, ఈఎన్‌టీ, పిడియాట్రిక్ ఓపీ విభాగాలు ఉన్నాయి. ఆయా ఓపీ విభాగాల్లో సేవలు పొందేందుకు కార్మిక కుటుంబ సభ్యులు వస్తారు. ఈఓపీ విభాగాలకు ప్రతి రోజు 50 నుంచి 60 మంది వరకు వస్తారు.

ఎక్సరే టెక్నీషియన్ లేక నిలిచిన సేవలు

ఏదైనా వ్యాధి నిర్ధారణ కోసం ఎక్సరే అనేది చాలా కీలకం. ఆస్పత్రిలో ఎక్సరే ప్లాంట్ ఉన్నప్పటికీ ఎక్సరే టెక్నీషియన్ లేకపోవడం వల్ల ఆ సేవలు కార్మికులకు అందడం లేదు. చాతిలో కఫం, ఇన్‌ఫెక్షన్ నిర్ధారణ కోసం, నడుం నొప్పి, మోకాళ్ల నొప్పి, ఏదైనా గాయాలు అయినప్పుడు వ్యాధి నిర్ధారణ కోసం ఎక్సరే తీస్తారు. డయోగ్నోస్టిక్ సెంటర్‌లో ఎక్సరే పనిచేయకపోవడం వల్ల కార్మికులు ఎక్సరే బయట తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.



చికిత్స కోసం వచ్చిన కార్మికులు

జరగని సీబీపీ పరీక్ష

డయోగ్నోస్టిక్ సెంటర్‌లో కంప్లీట్ బ్లడ్ పిక్చర్ (సీబీపీ) పరీక్ష జరగడం లేదు. రోగులకు చికిత్స అందించడంలో ఈ పరీక్ష చాలా ప్రధానమైనది. సీబీపీ పరీక్షలో హిమోగ్లోబిన్ ఎంత ఉంది, తెల్ల రక్త కణాలు సంఖ్య, ఎర్ర రక్త కణాలు సంఖ్య, ప్లేట్‌లెట్స్ సంఖ్య తెలుస్తుంది. వీటి అధారంగా రోగికి చికిత్స అందించడానికి అవకాశం ఉంటుంది. ఈ పరీక్షలు జరగడం లేదు.

21 వేల మంది కార్మికులు ఉన్నారు:

ఈఎస్ఐ డయోగ్నోస్టిక్ సెంటర్ పరిధిలో 21 వేల మంది కార్మికులు ఉన్నారు. వీరంతా ఏదైనా జబ్బు చేస్తే చికిత్స కోసం వస్తారు. ఓపీ సేవలు అవసరమైన వారికి ఇక్కడ చికిత్స అందిస్తారు. ఇన్ పేషేంట్ సేవలు అవసరమైన వారికి విశాఖలోని మల్కాపురంలో ఉన్న ఈఎస్ఐ ఆస్పత్రికి రిఫర్ చేస్తారు.

టెక్నీషియన్ లేకపోవడంతోనే...



ఎక్సరే టెక్నీషియన్ లేకపోవడం వల్ల ఎక్సరే తీయడం లేదు. ఎక్సరే టెక్నీషియన్ పోస్టు నియామకం ప్రాసెస్‌లో ఉంది. సీబీపీ రిజాన్స్ లేకపోవడం వల్ల చేయడం లేదు. రిజాన్స్ కావాలని ప్రతిపాదనలు పంపించాం.

– డాక్టర్ కృష్ణకిషోర్, సూపరింటెండెంట్, ఈఎస్ఐ డయోగ్నోస్టిక్ సెంటర్

వైద్యుడి ప్రవర్తనపై చర్యలు చేపట్టాలి

పార్వతీపురం టౌన్: జిల్లా ఆస్పత్రిలో ఫోరెన్సిక్ వైద్యుడిగా పని చేస్తున్న డా.ఎంకేవీ సంజీవ నాయుడు ప్రవర్తనపై చర్యలు చేపట్టాలని ఆస్పత్రి ఉద్యోగులు ఉద్యమబాట పట్టారు. ఈ మేరకు శుక్రవారం ర్యాలీ నిర్వహించి కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ డా.ఎంకేవీ సంజీవనాయుడు ప్రవర్తనతో ఆస్పత్రిలో పని చేస్తున్న అందరూ తీవ్ర ఇబ్బందులు, మనోవేదనకు గురవుతున్నారన్నారు. అనవసరంగా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తూ, ఆస్పత్రి అఫీషియల్ వాట్సాప్ గ్రూప్‌ల్లో ఇష్టం వచ్చినట్లుగా దురుద్దేశంతో మహిళలను, ఇతర సిబ్బందిని ఉద్దేశిస్తూ తీవ్ర పదజాలాలతో నోటికి ఇష్టం వచ్చినట్లు మెసేజ్‌లు పెడుతున్నారన్నారు. ఎన్నిసార్లు ఎంతో మంది సిబ్బంది, డాక్టర్లు, మెడికల్ సూపరింటెండెంట్ వారించినా అతని ప్రవర్తనలో ఏ రకమైన మార్పు లేదన్నారు. గతంలో కూడా ఇతనిపై దర్యాప్తునకు కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో ఒక కమిటీని వేయడం జరిగిందని కానీ దీనిపై ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. డా.ఎంకేవీ సంజీవనాయుడిని ఈ ఆస్పత్రి నుండి పంపించి మా అందరికి బాధల నుండి విముక్తి కలిగించాలని వారు కోరారు.

నేడు తోటపల్లి పాత ఆయకట్టుకు నీరు విడుదల

వీరఘట్టం: తోటపల్లి జలాశయం పరిధిలో ఉన్న పాత ఆయకట్టుకు శనివారం సాగునీరు విడుదల చేస్తామని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. కుడి, ఎడమ కాలువల పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని 64వేల ఎకరాలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



మృతుడు గంద్రేడి నూకరాజు(ఫైల్)

భోగాపురం: ఆగి ఉన్న లారీని మరో లారీ బలంగా ఢీకొనడంతో డ్రైవర్ గంద్రేడి నూకరాజు(36) మృతి చెందగా, క్లీనర్ ఏనుగుల రాము తీవ్ర గాయాల పాలైన సంఘటన శుక్రవారం ఉదయం సుందరపేట జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. విశాపట్నం జిల్లా సబ్బవరం గ్రామానికి చెందిన నూకరాజు డ్రైవర్‌గా, అసరపల్లి గ్రామానికి చెందిన ఏనుగుల రాము క్లీనర్‌గా విధులు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఇద్దరూ లారీలో బిస్కెట్ ప్యాకెట్లను లోడు చేసుకుని సబ్బవరం నుంచి ఒడిశా బయలుదేరారు. సుందరపేట జాతీయ రహదారి వద్దకు చేరుకునే సరికి అప్పటికే టైర్ పగిలి రహదారిపై నిలిచిపోయిన లారీని వెనుక నుంచి ఢీకొట్టడంతో డ్రైవర్ నూకరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. రాము తీవ్ర గాయాల పాలయ్యాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం నూకరాజు మృతదేహాన్ని సుందరపేట సీహెచ్‌సీకి, తీవ్ర గాయాల పాలైన రామును విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మృతుడు నూకరాజుకు భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని సోదరుడు గంద్రేడి వెంకినాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సూర్యకుమారి తెలిపారు.

14న జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు

విజయనగరం: జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 14న జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు నిర్వహించనున్నట్టు అసోసియేషన్ కార్యదర్శి సీహెచ్ వేణుగోపాలరావు శుక్రవారం తెలిపారు. విజయనగరం జిల్లా కేంద్రంలోని తోట పాలెం గాయత్రి స్కూల్ ఆవరణలో నిర్వహించే 17వ జిల్లా స్థాయి పోటీల్లో సబ్ జూనియర్, క్యాడెట్, సీనియర్ విభాగాల్లో క్రీడాకారులు తలపడవచ్చని పేర్కొన్నారు. ఈ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన క్రీడాకారులు ఆగస్టు నెలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు. పోటీల్లో పాల్గొనదలచిన వారు సెల్: 94904 97117 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

చెస్ క్రీడాకారుల ఎంపిక పోటీలు రేపు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న అండర్-11 చెస్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈ నెల 14న నిర్వహించనున్నట్టు చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం జిల్లా కార్యదర్శి కె.వి.జ్వాలాముఖి శుక్రవారం తెలిపారు. ఆ రోజు ఉదయం రింగ్‌రోడ్‌లోని ఫైర్ చెస్‌స్కూల్‌లో బాల, బాలికలకు నిర్వహించే పోటీల్లో పాల్గొనేందుకు 2013 జనవరి 1వ తేదీ అనంతరం జన్మించిన క్రీడాకారులు అర్హులుగా పేర్కొన్నారు. క్రీడాకారులు విధిగా జననధ్రువీకరణ పత్రాన్ని వెంట తీసుకురావాలని సూచించారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈ నెల 27, 28 తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చని, మరిన్ని వివరాలకు సెల్: 81791 35735 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.